క్లుప్తంగా

ఎఫ్ఎస్సీఎస్ డైరెక్టర్లకు ఎన్నికలు నిర్వహించాలి



మంగపేట : స్థానిక మంగపేట రైతుసేవా సహకార సంఘం (ఎఫ్ఎస్సీఎస్) 08, 10 డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ జిల్లా సహకార అధికారి(డీసీఓ) మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. సంఘంలో గతంలో జరిగిన ఎన్నికల్లో 08, 10వ స్థానం డైరెక్టర్లుగా గెలుపొందిన చెట్టిపల్లి సురేష్, కదారి రాజన్న ఇద్దరు మృతి చెంది రెండేళ్లు కావస్తున్నా ఆయా స్థానాలకు తిరిగి ఎన్నికలు నిర్వహించలేదన్నారు. తక్షణమే ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహించి సంబంధిత రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పరామర్శ



ములుగు రూరల్ : జిల్లాకేంద్రానికి చెందిన సింగరబోయిన లక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ పరామర్శించారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు చేయూతనందించారు. ఆయన వెంట మాజీ ఆత్మ చైర్మన్ బైకాని ఓదెలు, ముడతనపల్లి మోహన్, గడ్డమీది భాస్కర్, రాధ, సుభద్ర, రాజక్క, రజిత, ఉన్నారు.

బీఆర్ఎస్‌కు సీనియర్ నాయకుడి రాజీనామా

ములుగు : బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినట్లు ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు పెట్టం మల్లికార్జున్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదేళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం ఎంతో పాటుపడ్డానని పేర్కొన్నారు. నామినేటెడ్ పోస్టు ఇస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు. ఈ విషయాన్ని అధిష్టానం వరకు తీసుకెళ్లానని అన్నారు. అయినా న్యాయం జరగలేదని వాపోయారు. ఏ పార్టీలో చేరేది రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటానని అన్నారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

ములుగు రూరల్(గోవిందరావుపేట): ఇంగ్లిష్ భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని ఎంఈఓ గొంది దివాకర్ అన్నారు. మంగళవారం గోవిందరావుపేట మండలంలోని చల్వాయి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా), తెలంగాణ స్టేట్‌కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 7న విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 36 మంది విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కుంజ రాజేశ్వర్, శ్యాంసుందర్, అనిత, చెంచయ్య, వాణి, ఖలీల్, ప్రణీత, మల్లయ్య, రవికుమార్, సంతోష్‌కుమార్, వెంకటరమణ, రమేష్ పాల్గొన్నారు.

మౌనదీక్షకు అనుమతి ఇవ్వండి



ములుగు : రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బుధవారం, గురువారం నిర్వహించతలపెట్టిన మౌనదీక్షకు అనుమతి ఇవ్వాలని కోరుతూ జిల్లా వీఆర్ఏ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) వైవీ గణేష్‌కు వినతిపత్రం అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు పాండవుల మహేందర్, ఉపాధ్యక్షుడు కాసర్ల రాజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గంపల శంకర్, జేఏసీ జిల్లా కన్వీనర్ కుర్రం తిరుపతి, మండల అధ్యక్షుడు నన్నెబోయిన సురేశ్, అజ్మీర దాస్, జబ్బ నగేశ్, సాంబయ్య, లక్ష్మీ, పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘానికి నిధులు కేటాయించాలి

కాటారం: అసెంబ్లీ సమావేశాల్లో విశ్వబ్రాహ్మణ సంఘానికి ప్రత్యేక బడ్జెట్ కింద రూ.2వేల కోట్ల బడ్జెట్ కేటాయించేలా ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు కొండపర్తి శ్రీనివాస్‌చారి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో విశ్వబ్రాహ్మణ కులస్తులు ముఖ్యపాత్ర పోషించారని పేర్కొన్నారు. కులవృత్తుల సామాగ్రి అందించడంతో పాటు ప్రతి నిరుపేద కుటుంబానికి డబుల్‌బెడ్రూం ఇళ్లు, 50 సంవత్సరాలు నిండిన వారికి రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని అన్నారు.

స్వీయ రక్షణకు కరాటే దోహదం

- 33 పాఠశాలల విద్యార్థినులకు శిక్షణ
- ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ
- 24 వరకు కొనసాగింపు



కరాటే శిక్షణ నేర్చుకుంటున్న జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు

ఏటూరునాగారం : చట్టాలెన్ని తెస్తున్నా... షీ టీంలను నియమిస్తున్నా బాలికలు, యువతులు, మహిళలపై దాడులు ఆగడం లేదు. వేధింపులు తగ్గట్లేదు. ప్రేమ పేరిట పోకిరీల ఆగడాలు సరే సరి, ఇలాంటి పరిస్థితుల నుంచి బాలికలు తమను తాము రక్షించేందుకు నెల రోజుల పాటు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర విద్యాశాఖ సంచాలకురాలు శ్రీదేవసేన ఆదేశాలు ఇచ్చారు. ఏటూరునాగారం కరాటే అకాడమీ మాస్టర్లు అబ్బు, అక్రమ్, హుస్సేన్‌లు బాలికలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జనవరి 24 నుంచి ప్రారంభమైన కరాటే శిక్షణ ఫిబ్రవరి 24 వరకు కొనసాగుతాయి. జిల్లాలోని 9 మండలాల్లో 33 పాఠశాలల్లో 7 నుంచి 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థినులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టారు. ఆయా పరిధిలోని ట్రైనర్లు శిక్షణ ఇస్తున్నారు. నెలరోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతోంది. ప్రధానంగా బాలికలపై జరుగుతున్న అకృత్యాలు సభ్యసమాజాన్ని తలదించుకునేలా చేస్తున్నాయి. ఈ తరుణంలో బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు విపత్కర పరిస్థితుల్లో రక్షించుకోవడానికి కరాటే శిక్షణ దోహదం చేస్తుంది. గతంలో తర్ఫీదు పొందిన విద్యార్థినులు రాష్ట్ర, జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కూడా సత్తా చాటారు.

ఏకాగ్రతతో నేర్చుకుంటున్నాం



కరాటేను ఏకాగ్రతతో నేర్చుకుంటున్నాం.కరాటే నేర్చుకుంటున్న సమయంలో ఏదో శక్తి మా వెంట ఉన్నట్లు అనిపిస్తోంది. ఏ విషయంలో భయపడటం లేదు. ఆపద వచ్చినా ఎదుర్కొనే ఆత్మస్థైర్యం పెరిగింది.

– అలువాల విష్ణుశ్రీ, విద్యార్థిని

కరాటేతో ఆత్మస్థైర్యం



బాలికలకు విద్యార్థి దశ నుంచి ఆత్మరక్షణ విద్యలు నేర్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆపద సమయంలో సురక్షితంగా తప్పించుకోవడానికి కరాటే దోహదపడుతుంది.

– అనంతుల సురేందర్, ఎంఈఓ

ఆదివాసీ గానకోకిలకు ఘనసన్మానం



సమ్మక్క దంపతులను సన్మానిస్తున్న నాగరమేష్

మంగపేట: మండలంలోని మారుమూల అటవీ ప్రాంతమైన నిమ్మగూడెంకు చెందిన ఆదివాసీ గాన కోకిలగా పేరు తెచ్చుకున్న రైటర్, సింగర్ మద్దెల సమ్మక్క, భర్త రాజేంద్రప్రసాద్‌ను శ్రీ రామకృష్ణ సేవాట్రస్టు చైర్మన్ బాడిశ నాగరమేష్ మంగళవారం శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ రమేష్ మాట్లాడుతూ నిమ్మగూడెంకు చెందిన సమ్మక్క తన పాటల ద్వారా సమాజానికి దోహదపడే అంశాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్న తపనతో ఆదివాసీ సమాజం కోసం, ఆడపిల్లల జీవితం, రైతు, తల్లిప్రేమ తదితర ప్రాముఖ్యతపై భర్త రాజేంద్రప్రసాద్ సహకారంతో స్వయంగా పాటలు రాయడం, పాడటం అలవర్చుకుని అనతికాలంలోనే సింగర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. గత ఐదేళ్ళ నుంచి తాను రచించిన పాటలను స్వరకల్పనతో వీడియో ఆల్బం చేసి పీఎస్ఆర్ ఫోక్ సాంగ్స్ అనే యూట్యూబ్‌లో పెట్టడంతో ఆమెలోని ప్రతిభ వెలుగులోకి వచ్చిందన్నారు. గత ఏడాది మేడారం జాతర సందర్భంగా చిలకలగుట్టన..ఉత్తరదిక్కున అనే వీడియో సాంగ్ ద్వారా పరిచయమైన సమ్మక్క, సామాజిక చైతన్య గీతాల ఆడియే పాటలు ఎంతో అద్భుతంగా రచించి స్వరకల్పన చేశారు. ట్రస్టు వైస్‌చైర్మన్ బాడిశ నవీన్, ఆది నారాయణ, మునిగల మహేష్, ఇందారపు రమేష్, రాంమ్మోహన్, రాజశేఖర్, నరసింహవర్మ, విష్ణు, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



వెంకటాపురం(ఎం): మండలంలోని రామంజాపూర్ పరిధి గుంటూరుపల్లికి చెందిన మారపెల్లి రామకృష్ణ, పాలంపేటకు చెందిన మోలుగురి మహేందర్‌లు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా ములుగు, భూపాలపల్లి జిల్లా సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. సర్వర్ చారిటబుల్ ట్రస్టు–ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇరుకుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం అందించారు. ఆమె వెంట ట్రస్టు ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలి



గుడిసెవాసులతో మాట్లాడుతున్న బాబురావు

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం పస్రా శివారులోని 109 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న నిరుపేదల ఇండ్ల స్థలాలకు పట్టాలను అందించాలని భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబురావు అన్నారు. మంగళవారం గుడిసెవాసులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ఏరియాలో గిరిజనులు, నిరుపేదలు గుడిసెలు వేసుకున్న వారికే భూమి చెందుతుందని అన్నారు. భూస్వాములు తప్పుడు పత్రాలు సృష్టించి అధికారులను తప్పుతోవ పట్టిస్తూ పట్టాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురైన విషయంపై సీపీఎం ఎన్నో పోరాటాలు చేసిందని అన్నారు. ఉన్నతాధికారుల తీర్పును రెవెన్యూ అధికారులు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, ఆది రెడ్డి, పొదిళ్ల చిట్టిబాబు, పోశాలు, మురళి, శారద, రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

మహదేవపూర్: గుర్తుతెలియని వాహనం ఢీ కొని పంచాయతీ కార్యదర్శి గాయాలపాలైన సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని సూరారం గ్రామపంచాయతీ కార్యదర్శి బండం అంజలి ఉదయం వాకింగ్‌కు వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆమె కాలుకు గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

నేటి నుంచి బొడ్రాయి ఉత్సవాలు

టేకుమట్ల : మండల కేంద్రంలో బుధవారం నుంచి భూలక్ష్మీ–మహాలక్ష్మీ, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగ నున్నట్లు సర్పంచ్ పోలాల సరోత్తంరెడ్డి, ఎంపీటీసీ ఆది రఘు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో కొనసాగనుందన్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పోలీసులకు సహారా బాధితుల ఫిర్యాదు



ఎస్సైకి వివరిస్తున్న ఆర్ఎం హరిప్రసాద్

ఏటూరునాగారం : మండలంలోని సహారా ఇండియా పరివార్ బాధితులు పోలీసులను ఆశ్రయించారు. మంగళవారం స్థానిక ఎస్సై రమేష్‌ను కలిసి సహారా ఇండియాలో డిపాజిట్లు, పాలసీలు కట్టిన వారికి గడువు ముగిసినప్పటికీ కూడా డబ్బులు రావడం లేదని కిషోర్, శ్రీను, స్వరూప, యాకూబ్‌లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సహారా రీజినల్ మేనేజర్ హరిప్రసాద్, ఎస్ఎం రాజు, ఎస్ఎం నబీలను స్టేషన్‌కు పిలిపించారు. బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఎస్సై వారికి వెల్లడించారు. ఆర్ఎం హరిప్రసాద్ బాధితులకు న్యాయం చేసే విధంగా చూస్తానని హామీ పత్రాన్ని రాసి ఇచ్చి బాధితులకు నచ్చజెప్పారు.

విద్యార్థుల ఆందోళనపై ఎస్సై విచారణ



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై అశోక్

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చిరుతపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సోమవారం చేసిన ఆందోళనలపై మంగళవారం ఎస్సై అశోక్ చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఆందోళన చేయడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాగా అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టారు.

కొనసాగుతున్న జోడో యాత్ర



కూలీలతో మాట్లాడుతున్న సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్ : టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు చేపట్టిన హాత్‌సే హాత్ జోడోయాత్ర నియోజకవర్గంలో కొనసాగుతోంది. మంగళవారం ఆరవ రోజుకు చేరుకుంది. పార్టీ అర్బన్ అధ్యక్షుడు, దేవన్ ఆధ్వర్యంలో మునిసిపాలిటీ పరిధిలోని కాసింపల్లి, గడ్డిగానిపల్లి, బెడ్డలపల్లి, సెగ్గంపల్లి, సీఆర్‌నగర్ వరకు కొనసాగింది. ఈసందర్భంగా కాలనీల్లో కరపత్రాలు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్యనారాయణరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలన్నారు. ఆయా వార్డులో ఏర్పాటు చేసిన పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో టీపీసీసీ సభ్యులు మధు, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, ఐఎన్‌టీయూసీ నాయకులు జోగ బుచ్చయ్య, నాయకులు పృథ్వీ, ప్రసాద్, పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

టేకుమట్ల/రేగొండ : ఫిబ్రవరి 11న జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని టేకుమట్ల, రేగొండ ఎస్సైలు చల్ల రాజు, శ్రీకాంత్ రెడ్డి మంగళవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. పలు వివాదాల్లో కేసుల పాలైన వారు రాజీ కుదుర్చుకుని కేసుల నుంచి విముక్తి పొందేందుకు లోక్ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. ఫిర్యాదుదారులు, బాధితులు రాజీ కుదుర్చుకుని జిల్లా కోర్టులో కొనసాగే లోక్ అదాలత్‌లో పాల్గొనాలని తెలిపారు. ఫిర్యాదుదారులు, నిందితులు తమ ఆధార్ కార్డులతో రావాలని సూచించారు.

ఐలాపూర్ జాతరకు ఏర్పాట్లు పూర్తి

- సారలమ్మ రాకతో జాతర ప్రారంభం



సారలమ్మగద్దె వద్ద పూజలు చేస్తున్న పూజారులు

కన్నాయిగూడెం: మండల పరిధిలోని ఐలాపూర్‌లో జరిగే మరో మేడారంగా పిలువబడే సమ్మక్క సారలమ్మ జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. మండలంలోని సర్వాయి నుంచి ఐలాపూర్ వరకు సుమారు 14 కిలోమీటర్ల వరకు అడవి మార్గాన తల్లి సమ్మక్క సన్నిధికి చేరుకుంటుంది. సారలమ్మ రాకతో బుధవారం జాతర ప్రారంభం అవుతుంది. దీని కోసం వసతులను ముందస్తుగా జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్, ఇంజనీరింగ్ అధి కారులను కావలసిన వసతులను గుర్తించి పనులను సిద్ధం చేశారు. దీంతో జాతరకు ఎలాంటి లో టు రాకుండా ముందస్తుగా జాతర ప్రాంగణంలో విద్యుత్, నీటి వసతి భక్తుల కోసం రోడ్డు సౌకర్యం సిద్ధం చేశారు. కొండాయి నుంచి ఐలపూర్ వరకు, సర్వాయి నుంచి ఐలాపూర్ వరకు ముత్తారం మండలం రెడ్డిపెల్లి నుంచి ఐలాపూర్‌కు రోడ్లను అధికారులు సిద్ధం చేశారు. భక్తుల కోసం వైద్య శిబిరం ఏర్పా టు చేశారు. మంగళవారం సారలమ్మను గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాడెం కృష్ణ ప్రసాద్ దర్శించుకొని మొక్కులు సమర్పించుకున్నారు. వీరివెంట మేడారం సమ్మక్క సారలమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ శోభన్ ఉన్నారు.

పట్టుదలతో విజయం సాధించాలి



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

మంగపేట : విద్యార్థులు కృషి, పట్టుదలతో విజయం సాధించాలని మంగపేట ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ వెంకటయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎక్కటి సరోజిని–శేషారెడ్డి జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులు ద్వితీయ సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముందున్న కాలం మొత్తం పరీక్షల కాలమన్నారు. పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు ప్రతి విద్యార్థి క్రమశిక్షణ సమయ పాలనతో చదువుకుని పరీక్షలు రాజేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రేణుకాదేవి, సంతోష్‌కుమార్, జ్యోతిర్మయి, పాల్గొన్నారు.

అన్ని దానాలకన్నా విద్యాదానం గొప్పది



మంగపేట : విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దేవ్‌సింగ్

మంగపేట : అన్ని దానాలకన్నా విద్యాదానం గొప్పదని ప్రజా సేవకులు మున్సిపల్ కమిషనర్(వీఆర్ఎస్) భూక్య దేవ్‌సింగ్ అన్నారు. ములుగు నియోజకవర్గంలో పదోతరగతి విద్యార్థులకు రెండో విడత ఆల్ ఇన్‌వన్ స్టడీమెటీరియల్‌ను మండలంలోని మంగపేట, మల్లూరు, రాజుపేట, తిమ్మంపేట, నర్సింహసాగర్ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పుట్టిన నియోజకవర్గంలో చదువకుంటున్న ప్రతి విద్యార్థిని, విద్యార్థికి సేవ చేయాలనే దృక్పథంతో ఈ కార్యక్రమం చేపట్టానన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులకు చదువుపరంగా ఎలాంటి సమస్యలు వచ్చినా పుస్తకాలు కొనలేని విద్యార్థులకు తన సహాయ సహకారం ఉంటుందన్నారు. ఇష్టపడి 25 ఏళ్ళ వరకు చదివితే మరో 75 ఏళ్లు కష్టంలేకుండా జీవించవచ్చన్నారు. చదువుకోవడం వలన ప్రతి వ్యక్తికి జ్ఞానం, ఉద్యోగం, సంపద, రెస్పెక్ట్ కచ్చితంగా ఇస్తారని ఏ వ్యక్తి ఈ మూడు అంశాలు ఉంటాయో అతను ఇతరులకు మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. ఆ దిశగా ప్రతి విద్యార్థి కార్యాచరణ, ప్రణాళిక ఉండాలని విద్యార్థులకు చదువుపై మక్కువ కలిగే విధంగా పలు అంశాలపై మెలుకువలు తెలిపి నూతన సంవత్సర క్యాలెండర్లను అందచేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మేనక, బద్రయ్య, శ్రీనివాస్ ఉపాధ్యాయులు సామాజిక వేత్త దొంతి విజేందర్‌రెడ్డి, పోరిక రాహుల్‌నాయక్, మాధవి పాల్గొన్నారు.

వెంకటాపురం(ఎం): మండలంలోని జవహర్‌నగర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థినులకు మున్సిపల్ కమిషనర్ (వీఆర్ఎస్) దేవ్‌సింగ్ స్టడీ మెటీరియల్‌ను మంగళవారం అందించారు. సమాజాన్ని మార్చేంత శక్తి సామర్థ్యాలు మహిళలకే ఉంటాయని ధైర్యంగా ముందుకు వెళితే తప్పకుండా లక్ష్యాన్ని చేరుకుంటారని అన్నారు. సామాజికవేత్త దొంతి విజేందర్ రెడ్డి, పోరిక రాహుల్‌నాయక్, పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



ఏటూరునాగారం : కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

ఏటూరునాగారం : తెలంగాణ ప్రభుత్వం అంధత్వ లోపం ఉన్న బాధితుల కోసం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రొయ్యూర్ సర్పంచ్ జెట్ట సమత ఈశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని రొయ్యూర్ జీపీ కార్యాలయం ఆవరణలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కంటివెలుగు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడుతూ గ్రామంలోని అంధత్వ లోపం ఉన్న వ్యాధిగ్రస్తులు సకాలంలో వచ్చి పరీక్షలు చేయించుకొని అద్దాలను పొందాలన్నారు. అవసరమైతే శస్త్ర చికిత్సలకు సిఫారస్ చేయడం జరుగుతుందన్నారు.

క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీ

వైద్య శిబిరాన్ని క్వాలిటి కంట్రోల్ అధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పీఎంఓఏ రాజన్న మంగళవారం తనిఖీ చేశారు. పరీక్షలు ఏవిధంగా చేస్తున్నారు. అంధత్వ లోపం వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలకు తెలిపారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కంటివెలుగు ప్రోగ్రాం ఆఫీసర్ మంకిడి వెంకటేశ్వర్లు, డాక్టర్ సుమలత, ఏఎన్ఎంలు ఝాన్సీలక్ష్మి, పావణి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్, డీఈఓ రాజ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వర్‌రావు, ఉప సర్పంచ్ అల్లంల చంటి, ఎంపీటీసీ జాడి లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీసీ మర్రిగూడెం, ఉప్పెడువీరాపురం గ్రామాల్లో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు వైద్య శిబిరాలను మంగళవారం తాహసీల్దార్ అంటి నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎంత మందికి కంటి పరీక్షలు నిర్వహించారు, ఎంతమందికి కంటి ఆపరేషన్ కోసం రెఫర్ చేశారు అనే విషయాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ బాబు, సిబ్బంది ఉన్నారు.



వెంకటాపురం(కె): శిబిరాన్ని పరిశీలిస్తున్న మండల అధికారులు

పాదయాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సునీల్

పలిమెల : భూపాలపల్లి జిల్లా మంథని నియోజకవర్గ పరిధిలో బుధవారం నుంచి బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోయాల్కర్ నిరంజన్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉడుముల విజయరెడ్డి, జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి పానెం బాలు, శ్రీను, ఉపాధ్యక్షుడు రవీందర్, బీజేవైఎం మండల అధ్యక్షులు ఉపేందర్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు ఏర్కరి జయాకర్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు పీర్ల శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.